
సాక్షి
విశాఖపట్నం
మంగళవారం • 11 • మార్చి • 2025


అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి 8లో


కమనీయం.. అనంతుని కల్యాణం 8లో



న్యూస్‌రీల్

ఏయూలో టెక్నో కల్చరల్ ఫెస్ట్


సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'రీబూట్–2కె25'పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్ సోమవారం ప్రారంభమైంది. ఇంజినీరింగ్ విద్యార్థులు శాంకేతిక అంశాల్లో నైపుణ్యత సాధించేలా సదస్సు నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.పద్మశ్రీ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్వరి విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్ట్, లైంగిక హింసలను ఎలా ఎదుర్కోవాలి, పోలీసుల సహాయం ఎలా తీసుకోవాలో వివరించారు. సీఎస్‌సీ అండ్ ఐటీ హెచ్‌వోడీ ఆచార్య బి.ప్రజ్ఞ, కో–ఆర్డినేటర్స్ డాక్టర్ బి.ఎస్తేర్ సునంద, ఎం.కుమారి, డాక్టర్ ఎస్.అరుణ, జి.శిరీష తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

పోలీస్ శాఖలో బదిలీలు



విశాఖ సిటీ: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఎస్‌ఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు 34 మందికి స్థానచలనాలు కలిగాయి. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంవీపీ లాండ్ ఆర్డర్ ఏఎస్‌ఐగా ఉన్న పి.నరసింగరావును త్రీటౌన్‌కు, మల్కాపురం క్రైమ్ ఏఎస్‌ఐ జియా రుక్సానాను మహారాణిపేట లా అండ్ ఆర్డర్‌కు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న కె.సుబేదాబేగంను కంచరపాలెం లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. వీరితో పాటు 20 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 11 మంది కానిస్టేబుళ్లకు బదిలీ అయ్యాయి.

నలుగురు హెచ్‌సీలకు పదోన్నతి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతులు లభించాయి. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్‌బీలో హెచ్‌సీగా ఉన్న కె.శ్రీనివాసరావుకు ప్రమోషన్ కల్పిస్తూ అదే విభాగంలోనే ఏఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే హార్బర్ లా అండ్ ఆర్డర్ హెచ్‌సీగా ఉన్న బి.వేణుగోపాలరావును మల్కాపురం క్రైమ్ ఏఎస్‌ఐగా, గాజువాక క్రైమ్ హెచ్‌సీగా ఉన్న పి.నరసింగరావును మల్కాపురం లా అండ్ ఆర్డర్ ఏఎస్‌ఐగా, టూటౌన్ లా అండ్ ఆర్డర్‌లో ఉన్న జి.సత్యంను ఎంవీపీ లా అండ్ ఆర్డర్ ఏఎస్‌ఐగా పదోన్నతి కల్పించారు.

28న న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాద సంఘం వార్షిక ఎన్నికలు ఈనెల 28వ తేదీన జరుగుతాయని ఎన్నికల అధికారి ప్రముఖ న్యాయవాది జి.ఎం.రెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ, 19 తేదీన నామినేషన్లు పరిశీలన, 20 తేదీన ఉపసంహరణ అనంతరం నామినేషన్లు తుది జాబితా ప్రకటిస్తారు. 28వ తేదీన ఎన్నికల అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై రాత్రికి విజేతలను ప్రకటిస్తారు. న్యాయవాదులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా గతంలో కంటే భిన్నంగా త్వరితగతిన ఎన్నికల ఫలితాలను విడుదల చేస్తామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

21న స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టుకు ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టుకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ పోస్టుకు 12 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను షార్ట్ లిస్ట్ చేశారు. ఇందులో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన డీజీఎంలు చక్క మనోజ్‌కుమార్, డి.కె. శ్రీవాత్సవ, ఆలేటి జమ్మయ్య, ఐ. ఉమాదేవి, ఎస్. బెహరాతో పాటు హెచ్‌ఏఎల్, ఎన్‌టీపీసీ, ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, ఐవోసీఎల్, కేఐవోసీఎల్, భెల్ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొననున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వ్యవసాయశాఖ ఏడీగా చక్రవర్తి

మహారాణిపేట : వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె.చక్రవర్తిని నియమించారు. గతంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్–4గా ఆయన పనిచేశారు. ఇప్పుడు వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల ఈ పోస్టులో పనిచేస్తున్న అధికారి ఉద్యోగ విరమణ పొందారు.

• అంబరం.. తొలేళ్ల సంబరం







పైడిమాంబ ప్రతిమలతో భారీ ఊరేగింపు

కంచరపాలెం : కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణం నుంచి అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. గౌరీ సేవా సంఘం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు కొణతాల గోవిందరాజు, బొడ్డేటి నర్సింగరావు నేతృత్వంలో సాయంత్రం 4 గంటల సమయంలో వందలాది అమ్మవారి ప్రతిమలను రామ్మూర్తి పంతులుపేట నుంచి జ్ఞానాపురం, డాబాగార్డెన్స్, జగదాంబ కూడలి, కాన్వెంట్ కూడలి మీదుగా తిరిగి అమ్మవారి మూలవిరాట్, ఆర్‌పీపేట రైల్వే గేటు వద్దకు తీసుకొచ్చారు. అమ్మవారి ప్రధాన విగ్రహాన్ని ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ దంపతులు, గ్రామ కమిటీ సభ్యులు తోడ్కొని వచ్చి తొలేళ్ల సంబరాన్ని ప్రారంభించారు. పలు వేషధారణలు, నేలవేషాలు ఆకట్టుకున్నాయి. సుమారు 385 అమ్మవారి ప్రతిమలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మంగళవారం ప్రధాన ఉత్సవం జరగనుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మండు టెండలో.. చంటి బిడ్డలతో..





పేదలు గూడు కోసం ఎంత పరితపిస్తున్నారో ఈ చిత్రమే సాక్ష్యం. ఇల్లు లేని పేదలతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా దరఖాస్తులతో బాధితులంతా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. మండుటెండలో చంటి బిడ్డలతో తరలివచ్చారు. ఎండ అధికంగా ఉండడంతో ఓ తల్లి తన చంటిబిడ్డను కుమారుడి చేతిలో పెట్టి దరఖాస్తు అందజేయడానికి కార్యాలయం లోపలకు వెళ్లింది. ఆ ప్రాంగణంలో నీడ లేకపోవడంతో కార్యాలయం గోడ పక్కన.. కాలువ గట్టుపై ఉన్న నీడలో చిన్నారిని ఆడిస్తూ కనిపించాడు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మరో విదేశీ విమానం పాయె

- ఇటీవల దుబాయ్ విమానం విజయవాడకు..
- తాజాగా వియత్నాం విమానం హైదరాబాద్‌కు తరలింపు
- పట్టించుకోని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు
- వైజాగ్ నుంచి సర్వీసులకు ఆసక్తి చూపిస్తున్న ఆకాశా ఎయిర్‌లైన్స్
- స్పందించని కేంద్ర మంత్రి, ఎయిర్‌పోర్టు అధికారులు



సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయ విమాన సర్వీసులు విరివిగా నడిపేందుకు అన్ని అర్హతలున్నా.. కూటమి సర్కారు నిర్లక్ష్యం విశాఖ ఎయిర్‌పోర్టు పాలిట శాపంగా మారుతోంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ఉత్తరాంధ్రకు చెందిన వారే అయినా.. వస్తున్న విమాన సర్వీసులు కూడా ల్యాండ్ అవ్వకుండా టేకాఫ్ అయిపోతున్నాయి. ఇటీవల దుబాయ్ విమానాన్ని విశాఖ రానీయకుండా కూటమి సర్కారు అడ్డుకొని విజయవాడకు తరలించేసింది. ఇప్పుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు నిర్లక్ష్యంతో వియత్నాం విమాన సర్వీసు హైదరాబాద్‌లో ల్యాండ్ అయిపోయింది. డొమెస్టిక్ సర్వీసుల విషయంలోనూ అదే నిర్లిప్తంగా ఎయిర్‌పోర్టు వర్గాలు వ్యవహరిస్తున్నారు. విశాఖ నుంచి చక్కర్లు కొట్టేందుకు ఆకాశా ఎయిర్‌లైన్స్ సిద్ధంగా ఉన్నా.. అధికారుల నుంచి 'సిగ్నల్' అందకపోవడంతో అది గాల్లోనే నిలిచిపోయింది.

మేం వస్తామన్నా.. పట్టించుకోరా.?



విదేశీ సర్వీసుల పరిస్థితి ఇలా ఉంటే.. డొమెస్టిక్ సర్వీసుల పెంపుపైనా అదే వైఖరి కనిపిస్తోంది. ప్రముఖ ఎయిర్‌లైన్స్ ఆకాశా సంస్థ.. వైజాగ్ నుంచి హైదరాబాద్‌తో పాటు దేశంలోని వివిధ నగరాలకు సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ విషయంపై కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో పాటు వైజాగ్ ఎయిర్‌పోర్టు అధికారులకు నెల రోజుల క్రితమే సమాచారం పంపించింది. అయినా ఎవరూ స్పందించకపోవడంతో ఆకాశా ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మొన్న దుబాయ్ విమానం



విశాఖపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష, స్లాట్‌లపై నౌకాదళ ఆంక్షలు.. మొదలైన కారణాలన్నీ ఎయిర్‌పోర్టుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గో విభాగాలలో అపారమైన వృద్ధి సామర్థ్యం విశాఖకు ఉన్నా.. ప్రభుత్వం మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం మానేసింది. దీంతో కొత్త సర్వీసులు గగనమైపోతున్నాయి. మిడిల్ ఈస్ట్ దేశాలకు సర్వీసులు నడిపించేందుకు వైజాగ్ బెస్ట్ డెస్టినేషన్‌గా విమానయాన సంస్థలు భావిస్తుంటాయి. ఇటీవల మిడిల్ ఈస్ట్ దేశాల్లో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థ ఎమిరేట్స్.. ఏపీ నుంచి దుబాయ్‌కు విమాన సర్వీసు నిర్వహించేందుకు సిద్ధమైన తరుణంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఆ సర్వీసుని విజయవాడ నుంచి నడపాలని ఒత్తిడి తీసుకొచ్చింది. దీని వెనుక మంత్రి రామ్మోహన్‌నాయుడు చక్రం తిప్పడంతో.. ఇష్టం లేకపోయినా ఎమిరేట్స్ సంస్థ.. దుబాయ్ సర్వీసును విజయవాడ నుంచి ప్రారంభించేసింది.

తాజాగా వియత్నాం సర్వీసు



తాజాగా వియత్నాం సర్వీసు కూడా వెళ్లిపోయింది. గతేడాది సెప్టెంబర్‌లో వైజాగ్‌లో జరిగిన వియత్నాం టూరిజం కాంక్లేవ్‌లో ఆ దేశ రాయబారి ఇక్కడి నుంచి వియత్నాంలోని ప్రధాన నగరం హొచిమిన్ సిటీకి 2025లో సర్వీసు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఎయిర్‌ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధుల కృషితో కొత్త సర్వీసు రాబోతోందని అంతా భావించారు. అయితే మరోసారి వియట్‌జెట్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, వైజాగ్ ఎయిర్‌పోర్టు అధికారుల్ని అసోసియేషన్ కోరింది. అయినా స్పందించకపోవడంతో వియట్‌జెట్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టుతో సంప్రదింపులు జరిపింది. దీంతో వియట్‌జెట్ సర్వీసుతో పాటు.. వియత్నాం గవర్నమెంట్ ఎయిర్‌లైన్స్ సర్వీసు కూడా హైదరాబాద్‌కు తరలిపోయింది. ఫలితంగా రెండు నెలల కాలంలో రెండు విదేశీ సర్వీసులు వైజాగ్‌కు రాకుండా పోయాయి. దీనంతటికీ కేంద్ర మంత్రి నిర్లక్ష్యం, కూటమి సర్కారు వివక్షే కారణమని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'యువత పోరు'తో నిలదీద్దాం..


'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు తైనాల, చింతలపూడి, సమన్వయకర్త దేవన్‌రెడ్డి తదితరులు

- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిలు
- నిరుద్యోగులకు రూ.3 వేలు భృతిగా ఇస్తామని చెప్పి మాట తప్పారు
- 12న వైఎస్సార్ సీపీ యువత పోరు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల ముందు అబద్ధపు హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత యువతను, విద్యార్థులను, నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరణ అంశాలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న 'యువత పోరు' పేరిట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో 'యువత పోరు' పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన రైతు పోరుబాట, విద్యుత్ చార్జీలపై నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, అదే తరహాలో యువత పోరును మరింత విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, యువతకు పిలుపునిచ్చారు. పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలనే ఆకాంక్షతో మహానేత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని, దాన్ని ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరింత సమర్థవంతంగా అమలుచేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.4 వేల కోట్లు ఫీజు బకాయి పెట్టిందన్నారు. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరై, వాటిలో సగానికి పైగా పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయని, వాటి ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం పాల్పడుతుండటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పేడాడ రమణికుమారి, దొడ్డి కిరణ్, పులగమ కొండారెడ్డి, సనపల రవీంద్ర భరత్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ షరీఫ్, పార్టీ ముఖ్య నాయకులు నాగేంద్ర, ముచ్చల సంతోష్‌కుమార్, ఇల్లపు శ్రీనివాస్, కార్తీక్, నిఖిల్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనకు తరలిరండి

ఈ నెల 12న ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున జిల్లా యువత, తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొంటాయని పేర్కొన్నారు.

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణ

మహారాణిపేట: అభ్యంతరం కాని ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణకు జిల్లా యంత్రాంగం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 2019 అక్టోబర్ 15కు ముందు ఉన్న అక్రమణలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నారు. డిసెంబర్ 31లోగా గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరేందిరప్రసాద్ సూచించారు.

విధివిధానాలు

- 150 చదరపు గజాల వరకు ఏపీఎల్/బీపీఎల్ కుటుంబాలకు డి.పట్టా, కన్వేయన్స్ డీడ్ ఉచితంగా ఇస్తారు.
- 151–300 చ.గ.కు బేసిక్ విలువలో 15 శాతం చెల్లించాలి.
- 301–450 చ.గ.కు బీపీఎల్ కుటుంబం బేసిక్ విలువలో 100 శాతం, ఏపీఎల్ కుటుంబం 200 శాతం చెల్లించాలి.
- 451 చ.గ.లకు ఏపీఎల్/బీపీఎల్ ఎవరైనా బేసిక్ విలువకు 5 రెట్లు చెల్లించాల్సి వస్తుంది.
- చెల్లించాల్సిన రుసుం రెండు నెలల్లోగా చలానా రూపంలో ప్రభుత్వానికి చెందిన సీఎఫ్‌ఎంఎస్‌కు జమచేయాలి.
- దరఖాస్తుతో పాటు రిజిస్టర్ డాక్యుమెంట్, ఆస్తి పన్ను, కరెంట్ బిల్లు, నీటి పన్ను రశీదు, ఆక్రమణ ధ్రువీకరణ, ఇతర పత్రాలను జతచేయాలి.
- ఈ దరఖాస్తుల సర్వే కోసం తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ బృందాలను నియమించారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా తహసీల్దార్, సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్రమబద్ధీకరణ స్థలాలను పరిశీలించనున్నారు.

దివ్యాంగుల స్కూల్‌కు నాట్స్ ఆర్థికసాయం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డులోని సన్‌ఫ్లవర్ దివ్యాంగుల స్కూల్‌కు నార్త్ అమెరికా తెలుగు సంఘం(నాట్స్) రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందజేసింది. నాట్స్ ప్రతినిధులు సోమవారం స్కూల్ యాజమాన్యానికి సంబంధిత చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నాట్స్ సమన్వయకర్త వెంకన్న చౌదరి, నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని, ప్రెసిడెంట్ మదన్ పాములపాటిలు మాట్లాడుతూ భాషే రమ్యం– సేవే మార్గం నినాదంతో నాట్స్ మాతృభూమి రుణం తీర్చుకోవడానికి విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా సన్‌ఫ్లవర్ దివ్యాంగుల స్కూల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేందుకు రూ.10 లక్షలు, నాట్స్ పూర్వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, ఎవోలెటైజ్ వ్యవస్థాపకుడు(విశాఖ) శ్రీనివాస్ అరసాడ మరో రూ.10 లక్షలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాట్స్ కన్వెన్షన్ కన్వీనర్ శ్రీనివాస్ గుత్తికొండ, ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీహరి మందడి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీనివాస్ పిడికిటి తదితరులు పాల్గొన్నారు.


స్కూల్ యాజమాన్యానికి చెక్కు అందిస్తున్న నాట్స్ ప్రతినిధులు

తప్పుల తడకగా సీనియారిటీ జాబితా

- అప్పీళ్లకు ముగిసిన గడువు
- నవరణల కోసం 250 మంది దరఖాస్తు

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు ప్రకటించేందుకు విద్యాశాఖాధికారులు ఆపసోపాలు పడుతున్నారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీఐఎస్)లో సమగ్ర వివరాలు నమోదు సమయంలో ఉపాధ్యాయుల అలసత్వం, డీడీవోల నిర్లక్ష్యంతో జాబితాలు తప్పులతడకగా మారాయి. వీటి ఆధారంగానే త్వరలోనే ప్రమోషన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో ఉపాధ్యాయుల్లో కలవరం మొదలైంది. దీంతో సీనియారిటీ జాబితా లోపాలను సవరించి, తమకు న్యాయం చేయాలని కోరుతూ ఉమ్మడి విశాఖ జిల్లాకు సర్వీసు విషయాల్లో నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ జిల్లా డీఈవోకు తమ మొర విన్నవించుకునేందుకు ఉపాధ్యాయులు క్యూ కట్టారు. అప్పీళ్లకు సోమ వారం చివరి రోజు కావటంతో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 250 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు.

అప్పీళ్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీ

వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించే నిమిత్తం 12 మంది సీనియర్ ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు ఎంఈవోలతో జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును వారు పూర్తి స్థాయిలో పరిశీలించిన తరువాతనే టీఐఎస్ లాగిన్‌లో వాటిని సరిచేశారు. ఇలా 210 దరఖాస్తులను సోమవారం నాటికి ఒక కొలిక్కి తీసుకొచ్చి, ఉపాధ్యాయులు లేవనెత్తిన అంశాలను సరిచేశారు. మరో 40 వరకు దరఖాస్తులు అభ్యంతరాలతో కూడినవి కావటంతో.. మరోసారి క్షేత్రస్థాయి నుంచి నివేదికలను తెప్పించుకున్న తరువాతనే వాటిని సీనియారిటీ జాబితాలో చోటు కల్పించేలా చర్యలు చేపట్టారు.

జాబితాలపై ఉన్నత స్థాయి సమీక్ష

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు, సవరణల కోరుతూ వచ్చిన అప్పీళ్ల విషయమై సోమవారం విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి డీఈవో ప్రేమ్‌కుమార్, సర్వీసు వ్యవహారాలు చూసే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి, సంబంధిత సెక్షన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.


అప్పీళ్లను స్వీకరిస్తున్న కమిటీ సభ్యులు

ఆందోళన వద్దు

సీనియారిటీ జాబితాల్లో తప్పిదాలపై ఉపాధ్యాయులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉమ్మడి జిల్లాలో అన్ని క్యాడర్ల వారీగా పూర్తి స్థాయిలో సమగ్ర పరిశీలన చేసిన తరువాతనే తుది జాబితాలను వెల్లడిస్తాం. జాబితాల్లో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా.. ఉపాధ్యాయులు నేరుగా మా దృష్టికి తీసుకురావచ్చు.

– ఎస్.ప్రేమ్‌కుమార్, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

పీసీపీఐఆర్‌పై అభిప్రాయ సేకరణ

విశాఖ సిటీ: విశాఖ–కాకినాడ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీకేపీసీపీఐఆర్‌యూడీఏ) తుది మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. ఇందుకోసం త్వరలో వీకేపీసీపీఐఆర్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు, తెలుసుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. వాటిలో ఆమోదయోగ్యమైన అభ్యంతరాలు, సూచనలను మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరుస్తామన్నారు. అనంతరం తుది మాస్టర్‌ప్లాన్ ముసాయిదా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపిస్తామని వెల్లడించారు.

నేడు జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. డబ్ల్యుఎన్‌ఎస్, డిజిటల్ వుమెన్ సర్వీసెస్, అపోలో ఫార్మసీ లిమిటెడ్, యకోహామా టైర్స్ కంపెనీలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఎం.ఫార్మసీ, బీ.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఏదైనా డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. http://Naipunyam.ap.gov.inలో నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9948768778లో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు న్యాయమూర్తి దృష్టికి జిల్లా కోర్టు సమస్యలు



రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్‌తో విశాఖ న్యాయవాదులు

విశాఖ-లీగల్ : విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలో పలు సమస్యలు పరిష్కరించే దిశగా రాష్ట్ర హైకోర్టు తమ వంతు చేయూతనిస్తుందని విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్య నారాయణ తెలిపారు. సోమవారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పది నెలలుగా మూతపడ్డ విశాఖ న్యాయవాద సంఘం క్యాంటీన్ తిరిగి ప్రారంభించడానికి హైకోర్టు న్యాయమూర్తి సుముఖంగా ఉన్నారని తెలిపారు. అలాగే న్యాయవాదుల సంఘం ప్రాంగణంలో ఏసీలను అమర్చేందుకు సానుకూలంగా ఉన్నట్లు చెప్పారు. న్యాయవాదులు సమర్పించిన వినతి పత్రాలపై ప్రివిలేజ్ కమిటీలో పెడతామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వివరించారు. గత నెల 23న న్యాయవాద సంఘాలు తీర్మానం చేసిన హైకోర్టు బెంచ్ క్యాట్ ట్రిబ్యునల్ వంటివి సంబంధించి హైకోర్టు న్యాయమూర్తుల సంఘంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన వారిలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి దంతి నరేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు ఉన్నారు.

డైట్ సరఫరా కోసం టెండర్ల ఆహ్వానం

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో రోగులకు డైట్ సరఫరా కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కె.రామిరెడ్డి తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు టెండర్లను స్వీకరించటం జరుగుతుందని పేర్కొన్నారు. రూ.2 వేలు డీడీ తీసి ఆసుపత్రి కార్యాలయం నుంచి టెండర్ పత్రాలను పొందవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే



వందన సమర్పణ స్వీకరిస్తున్న అంగముత్తు

కంచరపాలెం: విశాఖ పోర్ట్ అథారిటీ 56వ సీఐఎస్ఎఫ్ రైజింగ్‌డే సాలిగ్రామపురం సీఐఎస్ఎఫ్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల రక్షణలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. సీఐఎస్ఎఫ్ యూనిట్ తన సత్తా, నైపుణ్యాలను ప్రదర్శిస్తూ డాగ్ షో, మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన, పిరమిడ్ ఫార్మేషన్, ఫైర్ డ్రిల్ నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ యూనిట్ సీనియర్ కమాండెంట్ సతీష్‌కుమార్ బాజ్‌పాయ్, పీఎస్ఎల్ స్వామి, టి.వేణుగోపాల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బెంగళూరు స్పెషల్‌కు యలమంచిలిలో హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖ-యలమంచిలి-విశాఖ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు యలమంచిలిలో అదనపు హాల్ట్ కల్పిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ-ఎస్ఎంవీ బెంగళూరు (08549) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16వ తేదీ నుంచి (రైలు నడిచే రోజుల్లో), తిరుగు ప్రయాణంలో ఈ నెల 17వ తేదీ నుంచి యలమంచిలిలో హాల్ట్ కల్పిస్తున్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్‌తో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ స్వీకరించారు.

అధికారులతో సమీక్ష : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జిల్లాలో రీ-ఓపెన్ అర్జీలు తరచుగా రావడంపై అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీపం పథకం అమలు, లబ్ధిదారుల ఖాతాలకు సబ్సిడీ అందుతున్నది లేనిది గమనించాలని సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇసుక లభ్యత, వినియోగంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పీ4 సర్వేపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 332 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 131 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించినవి 24, జీవీఎంసీ సంబంధించి 111 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 66 వినతులు వచ్చాయి.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదుల వెల్లువ

- జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 90 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జీవీఎంసీలో నిర్వహించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వివిధ జోన్లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తితో కలిసి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. మొత్తం 90 వినతులు రాగా..అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 50 ఫిర్యాదులు అందాయి. నిర్ణీత సమయంలో వీటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు శివప్రసాద్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా వినతులు పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయి. ప్రైవేట్ లేఅవుట్లకు సంబంధించి ప్లాట్ల విషయంలో ఎక్కువగా ఫిర్యాదులు రాగా.. వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అలాగే మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వాటిని త్వరలో పరిశీలిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జేసీ కె.రమేష్, ప్రధాన అర్బన్ ప్లానర్ శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



రూరల్ తహసీల్దారు కార్యాలయం గేటు ముందు నినాదాలు చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం రూరల్ తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించింది. ఆరిలోవ, మధురవాడ, ఎండాడ, రుషికొండ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఇళ్లులేని పేదలు తహసీల్దారు కార్యాలయం సమీపానికి చేరుకొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా నాయకులు, పేదలతో కలిసి జాతీయరహదారిపై విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఎర్ర జెండాలు పట్టుకొని ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం పేదలు నుంచి ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తులు సేకరించి తహసీల్దారు పాల్‌కిరణ్‌కు అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పడి తర్వాత అమలు చేయలేదన్నారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇంతవరకు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. అనంతుని కల్యాణం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి అనంత పద్మనాభ స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ముందుగా కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద ధ్వజారోహనం నిర్వహించారు. తదుపరి అనంత పద్మనాభ స్వామిని హనుమంతు వాహనంపైన, శ్రీదేవిని హంస వాహనంపై, భూదేవిని గజ వాహనంపై రాజవీధుల్లోఇ తీసుకు వెళ్లి ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహించారు. అనంత పద్మనాభ స్వామిని తూర్పు వైపున, శ్రీదేవి, భూదేవి విగ్రహాలను పడమర వైపున ఉంచి ఈ ఎదురు సన్నాహ మహోత్సవం జరిపారు. వేదపండితుల వేద మంత్రోచ్ఛరణలు, నాద మునీశ్వరుల స్వరాల నడుమ అనంత పద్మనాభ స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. పరిసర ప్రాంతాలైన మద్ది, కృష్ణాపురం, రెడ్డిపల్లి, విలాస్కాన్‌పాలెంల నుంచే కాకుండా దూర ప్రాంతాలైన విజయనగరం, తగరపువలసల నుంచి తరలి వచ్చిన భక్తులు అనంతుని కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఈవో నానాజీబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, భక్త బృందం సభ్యులు తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, కంటుబోతు ఎర్నాయుడు, సుంకర నారాయణరావు,తాలాడ పైడిరాజు పాల్గొన్నారు.



రాజవీధిలో అనంత పద్మనాభ స్వామికి నిర్వహిస్తున్న ఎదురు సన్నాహ మహోత్సవం

2,500 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పెదగంట్యాడ: పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రతి నెలా 1 నుంచి 15 వరకూ టన్నుల కొద్దీ బియ్యం వ్యాపారుల గుప్పెట్లోకి వెళ్లిపోతున్నాయి. ఒక పక్క అధికారులు దాడులు చేస్తున్నా బియ్యం వ్యాపారులు మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. ఈ నెల 4న సివిల్ సప్లయిస్ ఆర్ఐ బంగార్రాజు 900 కిలోల స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన జరిగిన వారం రోజుల్లో మళ్లీ గొడ్డువాని పాలెంలో టన్నులకొద్దీ బియ్యం తరలించేందుకు సిద్ధం చేశారనే సమాచారంతో న్యూపోర్టు పోలీసులు సోమవారం దాడులు చేశారు. వ్యాన్‌లో ఉన్న 2,500 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మధురవాడలో ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

మధురవాడ: మధురవాడ వైఎస్సార్ కాలనీలోని శ్రీ వాసవి మాత ఆలయ ఆవరణలో శివుడు, వేంకటేశ్వర స్వామి ఆలయాలతోపాటు వారాహి మాత ఆలయాలు నిర్మాణానికి సోమవారం కమిటీ ప్రతినిధులు, పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు, అధికార పార్టీ నాయకులు శంకుస్థాపన చేశారు. గరివిడి శ్రీ విద్యా సౌరశక్తి పీఠానికి చెందిన ఆగమశాస్త్ర పండితులు సూర్యసదనంచే ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం సేవా సంఘం ప్రతినిధులు, నిర్మాణ కమిటీ ప్రతినిధి, వేంకటేశ్వర విద్యాసంస్థల అధినేత యేటూరి వేంకటేశ్వర్లు, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లికార్జునరావు, వైభవ్ జ్యూయలర్స్ గ్రంధి మల్లికా మనోజ్, మేఘాలయ గ్రంధి సురేష్, శ్రీకన్య, సినీపోలీస్ ఎస్‌వీఎస్ గురుమూర్తి, ఏఎస్ స్టీల్ ట్రేడర్స్ ఎ.నగేష్, వీ కన్వెన్షన్స్ పీవీ నరసింహారావు, జేకే లాజిస్టిక్స్ పి.శోభన్ ప్రకాష్, శ్రీకన్య ఫార్చ్యూన్ కె. గురుమూర్తి, ఏయూ ఆచార్యులు మద్దుల రామ్‌జీ, తిరుమల స్టీల్స్ గ్రంధి రాంజీ, లివింగ్ లైన్స్ శ్రీనివారావు, కార్పొరేటర్‌లు మొల్లి హేమలత, పిళ్ల మంగమ్మ, జెడ్పీ కనకమహాలక్ష్మి, నిర్మాణ కమిటీ ప్రతినిధులు పి.జగదీష్, లక్ష్మీనారాయణ, కొల్లి వాసు పాల్గొన్నారు.



ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పైడా కృష్ణప్రసాద్, ఆర్యవైశ్య ప్రముఖులు

రోజా కేసులో రోజుకో ట్విస్ట్

- ఎట్టకేలకు ఆమె స్నేహితుడు డాక్టర్ శ్రీధర్ అరెస్ట్
- ఆత్మహత్యకు ప్రేరేపించినట్టు సమాచారం

బీచ్‌రోడ్డు: ఎన్ఆర్ఐ మహిళ రోజా అనుమానాస్పద మృతి క్రైం థ్రిల్లర్‌ను తలపిస్తోంది. కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. నగర పోలీసు కమిషనర్ ఆదేశాలతో ఎట్టకేలకు మృతురాలి స్నేహితుడు, నిందితుడిగా భావిస్తున్న డాక్టర్ శ్రీధర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎన్ఆర్ఐ మహిళ రోజాకు.. డాక్టర్ శ్రీధర్‌కు మధ్య ఉన్న సంబంధం ఏంటి?.. రోజా హోటల్‌కు వచ్చిన రెండు గంటల్లో అనుమానాస్పదంగా మృతి చెందడం వెనుక ఏం జరిగిందో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 1.40 గంటలకు శ్రీధర్‌ను కలిసేందుకు మేఘాలయ హోటల్‌లోని రూం నంబర్ 229కి రోజా వెళ్లింది. 3.35 గంటల తరువాత ఆమె బాత్ రూమ్‌లో అపస్మారక స్థితిలో ఉందని శ్రీధర్ హోటల్ సిబ్బందికి చెప్పాడు.

హత్యా? ఆత్మహత్యా?

రెండు గంటల వ్యవధిలో రోజా అనుమానాస్పదంగా మృతి చెందడంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. రెండు గంటలు ఇద్దరూ ఒకే గదిలో ఉన్నారు. ఈ సమయంలో రోజా-శ్రీధర్‌కు మధ్య గొడవ జరిగిందా?.. ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాడా? అందుకే ఆమె ఆత్మహత్య చేసుకున్నా ఆపకుండా చూస్తూ ఉండిపోయాడా?.. మృతి చెందిందని నిర్ధారించుకున్న తరువాతే హోటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడని ప్రచారం జరుగుతోంది. నిజానికి రోజాను ఆత్మహత్య చేసుకునేలా అమెరికాలో ఉన్నప్పటి నుంచే శ్రీధర్ ప్రేరేపిస్తున్నాడని పోలీసులు విచారణలో తెలినట్లు తెలిసింది. ఒకవేళ రోజాది ఆత్మహత్య కాకపోతే అదే రూమ్‌లో ఉన్న శ్రీధర్ ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రోజా పోస్టుమార్టం నివేదిక వస్తే తప్ప నిజనిజాలు బయట పడే అవకాశం లేదు.

ఎఫ్ఐఆర్‌లో శ్రీధర్ పేరు చేర్చలేదెందుకు?

ఈ కేసులో మొదటి నుంచి పోలీసులు నిర్లక్ష్యం కనిపిస్తూనే ఉంది. డాక్టర్ శ్రీధర్‌ను కేసు నుంచి తప్పించే యత్నం జరుగుతోందని విస్తృతంగా ప్రచారం జరిగింది. కేసు తేలిపోయేవిధంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒకే గదిలో రోజా-శ్రీధర్ ఉన్న సమయంలో.. రోజా అనుమానాస్పదంగా మృతి చెందితే ఎఫ్ఐఆర్‌లో శ్రీధర్ పేరు చేర్చకపోవడం చర్చనీయాంశమైంది. కేసును నీరుగార్చేందుకు పోలీసులు ఎందుకు ప్రయత్నించారు? డాక్టర్ శ్రీధర్ వెనుక ఎవరున్నారు? పోలీసులపై ఎవరి ఒత్తిడైనా ఉందా? అన్న ప్రశ్నలకు వారే సమాధానం చెప్పాలి. ఈ కేసు విషయంలో విమర్శలు రావడంతో ఎట్టకేలకు మూడో పట్టణ పోలీసులు శ్రీధర్‌ను అరెస్టు చేసినట్లు ఆదివారం అర్ధరాత్రి ప్రకటించారు.

అన్ని వేళ్లూ పోలీసులవైపే..

ఎన్ఆర్ఐ మహిళా అనుమానాస్పద మృతిపై పోలీసులు చర్యలు విమర్శలకు తావిచ్చింది. సంఘటన జరిగిన వెంటనే శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తే నిజనిజాలు బయటపడేవి. అయితే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు నుంచి విచారణ వరకు అన్ని వేళ్ల వారివైపే చూపించేలా వ్యవహరించారు. 6వ తేదీన రోజా మృతి చెందినప్పటికీ 8వ తేదీ వరకు అటువంటి ఘటన జరగలేదు అన్నట్లు వ్యవహరించారు. పలుకుబడి ఉన్న కుటుంబాలకు చెందిన వ్యక్తులు తప్పు చేస్తే వెనకేసుకువచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు. పేద, మధ్యతరగతికి చెందిన ఎవరైనా తప్పు చేస్తే మీడియా సమావేశాలు పెట్టి మరీ ప్రచారం చేసుకునే పోలీసులు ఈ కేసు విషయంలో పాటిస్తున్న గోప్యత అనుమానాలకు తావిస్తోంది.

సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయ్ పూలే వర్ధంతి సందర్భంగా నివాళర్పించిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ రవీంద్రబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల, చింతలపూడి, సమన్వయకర్త దేవాన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం : మహిళల సమానత్వం కోసం, వారి అభ్యున్నతి కోసం ఉద్యమం చేసిన సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో విశాఖ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గుడివాడ అమర్‌నాథ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

- 78 పోలీస్ బృందాలతో 96 హోటళ్లు, లాడ్జీల్లో సోదాలు
- ఫైర్ ఎన్‌వోసీలు లేకుండా 42 హోటళ్లు, లాడ్జీల నిర్వహణ




హోటల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

విశాఖ సిటీ : నగరంలోని హోటళ్లు, లాడ్జీల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జోన్-1, జోన్-2 పరిధిలో 78 బృందాలతో 96 హోటళ్లు, లాడ్జీల్లో ఏకకాలంగా బాడీ వార్న్, మొబైల్ కెమెరాలను వినియోగిస్తూ సోదాలు చేపట్టారు. అతిథుల జాబితాలో పరారీ నిందితులు, ఎన్‌బీడబ్ల్యూలు ఉన్న వారు, వీసా, పాస్‌పోర్ట్ లేని, వీసా అనుమతికి మించి ఉన్న వారి కోసం తనిఖీ చేశారు. అసాంఘిక కార్యక్రమాలపైనే కాకుండా ఫైర్ ఎన్‌వోసీ, ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ, ఫుడ్ లైసెన్స్, మద్యం అమ్మకాలు, సీసీ టీవీల పనితీరు ఇలా అన్ని అంశాలను పరిశీలించారు.

అనుమతులు లేకుండానే వ్యాపారాలు : పోలీసుల తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఫైర్ ఎన్‌వోసీ, జీఎస్టీ, ట్రేడ్ లైసెన్సులు లేకుండానే హోటళ్లు, లాడ్జీలు నిర్వహిస్తున్నట్లు మరోసారి వెల్లడైంది. ఇప్పటికే పలుమార్లు పోలీసుల తనిఖీల్లో ఈ విషయం నిర్ధారణ అయినప్పటికీ.. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికీ వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పోలీసుల తాజాగా తనిఖీల్లో కూడా పదుల సంఖ్యలో హోటళ్లు, లాడ్జీలు అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్నట్లు స్పష్టమైంది. 42 హోటళ్లు, లాడ్జీలలకు అగ్నిమాపక ఎన్‌వోసీలు లేనట్లు గుర్తించారు. అలాగే 12 సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు, మరో 12 హోటళ్లకు ఫుడ్ లైసెన్సులు, 17 వ్యాపారాలకు జీఎస్టీ సర్టిఫికెట్లు లేనట్లు నిర్ధారణైంది. అదే విధంగా రెండు హోటళ్లలో సందర్శకుల రికార్డులు నిర్వహించడం లేదని, 14 హోటళ్లు, లాడ్జీలలో విజిటర్స్ మోనిటరింగ్ సిస్టమ్‌లో సందర్శకుల సమాచారాన్ని అప్‌డేట్ చేయడం లేదని, 2 హోటళ్లలో సీసీటీవీలను పర్యవేక్షించడం లేదని వెల్లడైంది. వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు అనుసరించాలని, పాటించని వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి నిర్వాహకులను హెచ్చరించారు.

కమిషనర్‌ను నియమించకపోవడం కూటమి వైఫల్యమే..

- కూటమికి అనుకూల వ్యక్తి కోసమే ఆలస్యం
- సీపీఎం, సీపీఐ నేతల ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నేతలు గంగారావు, స్టాలిన్

డాబాగార్డెన్స్ : రాష్ట్రంలోనే విశాఖ కీలక నగరం..జీవీఎంసీ ఆయువుపట్టు..అలాంటి సంస్థకు కమిషనర్‌ను నియమించకపోవడం దారుణమని సీపీఎం, సీపీఐ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్లు డాక్టర్ బి గంగారావు, ఏజే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్‌ను నియమించారు. ఐదు నెలలు తిరగకముందే ఆఘమేఘాలపై ఆయనను చంద్రబాబు ప్రభుత్వం బదిలీ చేయడం వెనుక ఆంతర్యమేంటో అర్థం కావడం లేదన్నారు. తక్షణం జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ సంస్థ ప్రధాన కార్యాలయ ద్వారం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావు మాట్లాడుతూ ఐదు నెలల కాలంలోనే డాక్టర్ సంపత్‌కుమార్ కమిషనర్‌గా సమర్థవంతంగా పని చేశారన్నారు. అటువంటి కమిషనర్‌ను ఐదు నెలలు తిరగకముందు కూటమి నేతల స్వార్థం కోసం ఆయనను అమరావతికి బదిలీ చేశారని ఆరోపించారు. కమిషనర్ బదిలీఅయి రెండు నెలలు కావస్తున్నా..జీవీఎంసీకి కమిషనర్‌ను నియమించాలని ఆలోచన చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. కూటమికి అనుకూలంగా ఉన్న వ్యక్తిని కమిషనర్‌గా నియమించేందుకు మీలో గలాటా జరుగుతుందని తెలిసింది. ఇది సరైనది కాదన్నారు. సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ కమిషనర్‌ను నియమించకపోవడం దారుణమన్నారు.